# సముద్రం...

లెనిన్. ధనిశెట్టి

**తెల్లారతా వుండాది... చిత్తకార్తె వాన వొక్కజల్లు కురిసి, నిలిచి పొయ్యింది. పిట్టలన్నీ రెక్కలార్చినాయి. చెట్లన్నీ తలకి బోసుకున్నాయి. నేలగుండి మీద పారాడతా వుండాయి నీళ్ళు... జల జలా... మూడు దినాలుగాబడని చేపల కోసం కిష్టడు వొల భుజానేసుకొని నడిచిపోతావుండాడు వుప్పుకాలవ కేసి.**

దిగబడతా వుండాయి కాళ్ళు బురదలో... బురద బుడ్డు లేసుకొని వుప్పుకాలవ గెట్టెక్కినాడు... సుళ్ళుదిరగతా పారతా వుండాది సవద్రంలోకి కాలవ. కిష్టడి గుండి పొంగిపోతా వుండాది... చెరువులో పక్కిమాదిరి కిష్టడి బుద్ధి గెంతులేసినాది. భుజం మీది వొలని దించి సవరదీస్తా, పోలేరమ్మ తల్లికి కడుపులోనే మొక్కినాడు- తల్లే సందేళకి వొల నిండి వాటమైన చేపలొస్తే నీకు నా కుంటిపుంజు నిస్తానని. పోలి చెల్లి గంగను దలుచుకొని వొలిసిరినాడు. తామరపువ్వులాగా తెరుసుకొని కత్తిలాగా నీళ్ళని కోసుకుంటా దూకింది వొల కాలవలోకి. పోతరాజు కాణ్ణించి పట్రంగం పరవేశ్వరుడిదాకా అందరు దేవుళ్ళనీ మొక్కతా వుండాడు కిష్టడు... వొల నిండాల... చేపలమ్మాల... చేపలమ్మేసి నా చెంద్రికి నాటుమందు దేవాల... నా బంగారు చెంద్రికి చీర దేవాల... యెట్టుండేది నా చెంద్రి...

'అందాలదానా... ఆనందపుదానా... చారెడూకళ్ళా బంతులా బుగ్గలాదానా... దానిమ్మాపళ్ళా వరసా... తేనేపలుకులదానా, ఆట్టాంటిట్టాంటిదానా మరువలేనే బొమ్మా మరువలేనే, యేపమానూ ఎల్లమ్మా సాచ్చిగా నిను మరువలేనే......' కాలవ పక్కన గుంటలో గుడ్డలు బండకేసి బాత్తా పాడతా వుండాడు సాకలి తిప్పడు. ముసిముసిగా నవ్వుకొన్నాడు కిష్టడు ఆపాటిని...

ఎట్టుండేది నా చెంద్రి... ఎట్టయిపోయింది. మూడు దినాలుగా చెంద్రికి గాలిసోకినాది. చీటాకు గట్టినా బోలా, వొడుపు గెడ్డ నూరి బెట్టినా బోలా, యాపమాను తాయెత్తి గట్టినా బోలా... ఎట్టుండేది నా చెంద్రి... యేకాటి చేపల్ని వొక్క దెబ్బతో గోసి వుప్పూగారం బెట్టి ఎండేసి పారేసేది. తెగిన వొలని తెగినట్టుగానే గుట్టిపారేసేది. ఎట్టుండేది నా చెంద్రి. దానెమ్మనాయాల్ది గుడ్డెంగటమ్మ దిష్టిదగిల్నట్టుగా వుండాది, ఎండిపోయి పుల్లయిపోయినాది. దాని వొళ్ళంతా నల్లంగా దిరిగిపోతా వుంది. వొల నిండాల. చేపలమ్మాల. ఇయాళ వైదిగుడికాడ నాటు మొందు దేవాల... వొక్క దెబ్బన లాగేడు వొలని... తావరమొగ్గ మాదిరిగా ముడుసుకొన్నాది నీళ్ళల్లో వొల. నిదానించి లాగతా వుండాడు. లేత ఎండ కిష్టడి వొంటిపైనబడి మెరస్తా వుండాది నిగనిగా... సగం వొలని లాగినాడు. కిష్టడి మొహంలో కోటి కలువలు బూసినాయి. వొల బరువుగా వుండాది. పక్కిలు, సుక్కచేపలు, వోరువాయిలు, పిల్లసొరలు, ఆడాడ రొయ్యిపిల్లలు, యేడు ముద్దల బంగారం దొరికినట్టుండాది కిష్టడికి, వోడి గుండి నిండిపోయింది.



వొల్లో నుంచి యేరి వొక చేపని నీళ్ళలో వొదిలాడు గంగమ్మకి. పది పక్కిల్ని కాకులికేసినాడు. కొరవ చేపల్ని తాటాకు బుట్లో యేసినాడు. ఇంక కిష్టడి దగ్గర రెండు తాటాకు బుట్లుండాయి, నిండాల్సినాటివి. మూడే తలు వొలేసినాడు. రొండు బుట్లూ నిండిపోయినాయి. పొద్దు తలపైకొచ్చింది. కడుపులో కరకరమంటా వుంది. తిప్పడి నడిగి బుర్రలో నీళ్ళు దాగినాడు. వొల భుజానేసుకొని, బుట్లెత్తుకొని వూరి సాయి బోతావుండాడు గాల్లో దేలతా... పడవటీది జేరే యారకే బుట్లు కాళీ అయినాయి. వైదిగుడి కాడికి బొయ్యి జబ్బు జెప్పి మొందు నూరిచ్చుకొన్నాడు. ఆనేక శెట్టంగటికి బొయ్యి బియ్యం, పప్పు గొన్నాడు. సక్కా కల్లు మంగమ్మకాడికి బొయ్యి మూడు చెంబుల కల్లు దాగి నేరుంగా ఇంటిసాయి బోతా వుండాడు. పొద్దుగూకే పోయినాది...

కల్లు దాగిందాడనే గాని, చెంద్రి కష్టం కిష్టడి గుండిల్లో గొడతా వుంది. దూరంగా చీకట్లో మసక మసగ్గా గుడిశ గనిపిస్తావుండాది. గుడిశిలో గుడ్డిదీపమెలుగ్గూడా లేదు. ఇసికదిబ్బలెనకాలి గుడిశ దగ్గరవతా వుంది. గుడిశ దాపుకొచ్చి చెంద్రీ... చెంద్రీ అని కేకేసినాడు. మారుబలక లేదు. తటక్కన బయివేసి గుండె గుభిల్లుమన్నాది కిష్టడికి... వొక్క లగుదీసినాడు గుడిశిలోకి. చెంద్రి నిదరబోతా వుండాది నిమ్మళ్ళంగా...

చెంద్రి చెయ్యి మీద చెయ్యి బెట్టి వొణకతా బిలిచినాడు దడదడలాడే గుండితో. సచ్చిన చేపలాగా, సల్లంగా మొంచులాగుండాది చెంద్రి వొళ్ళు. పట్టుకోని కదిలిచ్చినాడు. యీ తట్టుకి బడిపోయినాది. ఎండిజేపలాగా గుడ్లు తేలేసినాది. బోరోమని నడువులిరిగిన తెట్టు చేపమాదిరి కూలిపోయినాడు. వోడి కళ్ళలో బూదాటి చల్లకాలవలు పొంగినాయి. సలీజెరం వొచ్చినోడిలాగా వొనకతా వుండాడు. యాడస్తావుండాడు. యన్నా ఎట్ట బతికేతి నేనూ... ఎవులి కోసం బట్టాలి చేపల్ని నేనూ... నా తల్లి నన్నొదిలేసి సక్కబోయినాది. గుక్క బెట్టి యాడస్తావుండాడు. ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లినాడు. రేపట్నించి ఎట్ట బతకాల... యెవుర్ని జూసుకొని వొలెయ్యాల... లేదు... నా చెంద్రి బతకాల... బతకాల... నేను దీన్ని బతికించుకుంటాను. ఎంకయ్యిసోవి నా చెంద్రిని బతికిస్తాడు. ఆ సోవి మంత్రకట్టేసి నా చెంద్రిని బతికిస్తాడు... వాడిలో వోడే గట్టుమీద బడ్డ సొరచేపలాగా గిలగిలలాడతా వుండాడు... ఆయువు గూడకట్టుకొని లేసి, చెంద్రి పీనిగిని భుజానేసుకొని పోతా వుండాడు పిచ్చోడి మాదిరిగా... వోడు... కిష్టడు వుప్పుకాలవ సాయి బోతా వుండాడు. సలి ఈదరగాలి దోలతా వుండాది టపా... టపా... టపా... సూదుల్లాగా చినుకులు రాలతా వుండాయి. అమాసిగోడి తెప్ప కాలవ నీళ్ళలో అల్లల్లాడతా వుంది. దాన్ని వొడ్డుకిలాగి పీనిగిని దాంట్లో పండేసి... తాడు దెంపినాడు. సర్రమని దూకింది తెప్ప పారేనీళ్ళలోకి... తెప్పని వాటంగా వాలుగా నడపతా వొడ్డుకు చేరి పీనిగిని భుజానేసుకొని చేవలతిప్ప అడివిలోకి బోతా వుండాడు... వున్మాదిలాగా- అమాశిగోడి తెప్ప కాలవలో గొట్టుకుపోతా వుంది దూరంగా...

నడిసీ... నడిసీ ఎంకయ్యాసోవి పూరింట్లో దూరి సోవి పాదాల ముందర బెట్టినాడు. తడిసి ముద్దయిన పీనిగిని. ఎట్టయినా దీన్ని బతికిచ్చు సావే అంటా వంజరం చేపలాగా వాలిపోయినాడు... సోవి పాదాలపై...

వొరే కిష్టా ఏందిరా అబ్బయ్యా నువ్వు జేసే పని?... తప్పురా... కిష్టా తప్పు... దాని కాలందీరిపోయింది.

వొక పనిజెయ్యి సావే... నెప్పి దగలకుండా మంత్రవేసి నన్నూ జంపు...అది లేకుండా నేను బతకనే బతకను... సావీ బతకను. వోడికంట్లో చుక్కనీరు రావడం లేదు. కడుపులో కువలతా ఏడస్తావుండాడు... సొంతం కుళ్ళతా వుండాడు.

కాసేపు కళ్ళు మూసుకొని అపట జెప్పినాడు ఎంకయ్యి సావి... కిష్టా నా పని నేను జేస్తాను. ఆనేక జరిగే దానికి నువ్వే కట్టుబడుండాల. తలూపినాడు కిష్టడు. కిష్టా పైకి లెయ్యి నీ బొట్నేలి రక్తం రెండు చుక్కలు దాని నోట్లో బొయ్యి, చెప్పినాడు సావి. రెడ్డోరి మాటినే తలకాపులాగా... బొమ్మలాగా... సూరుకంప ముల్లుతో బొట్నేలిని గుచ్చుకొని రెండు రకతపు బొట్లను చెంద్రి పీనిగి నోట్లో యేసినాడు... ఎక్కడో ధడేలుమని పిడుగుబడ్డాది... వాన చీకటి మీదకి ఎగబడ్డాది... చెట్లు పిచ్చిబట్టినట్టు వూగతా వుండాయి. లేసి కూర్చునాది చెంద్రి... నిదర్లో మేలుకొన్నట్టు... చెంద్రి మొహంలో ఎర్ర బెరుపు... ఎనకెప్పుడూ లేని కళకళ... కిష్టడు సావి కాళ్ళ మీదబడి అండగండాలుగా ఏడ్చినాడు ఎక్కెక్కి. ఆయన మాట మీద ఇద్దరూ పయానవై చీకట్లో గలిసిపోయినారు. వానా... గాలీ రెండూ నిలిచిపోయినాయి. మిలమిలలాడతా సుక్కల్తో ఆకాశం ఎవురో అప్పుడే కడిగినట్టు సుద్దంగా వుండాది.

కిష్టడికి కాలం కుశాలగా గడిచిపోతా వుంది. వుప్పు కాలవలో నీళ్ళు తగ్గినా చేపలికి మాత్రం కొదవలేదు... కిష్టడి కష్టవంతా చెంద్రికే... యిద్దరూ బొమ్మిడాయిల మాదిరిగా బతకతా వుండారు వొద్దికగా... యిట్ట రోజులు బోతావుండగా... వొక దినాన వుమ్మడంగక్కే ఎర్ర టెండ గాస్తా వుండాది. కంటిసూపు కొసాన మబ్బు లేస్తావుండాది మట్టిపావు మాదిరిగా... ఆ దినాన... వుప్పుకాలవ కట్ట మీద చెంద్రి రొయ్యిపొట్టు ఎండబెడతా వుంది. కిష్టడు తెప్పను గొంటానికి పొయినాడు... వుప్పుకాలవలో పెద్ద మరపడవ ఏనుగులాగా డబడబా వస్తావుంది... దానిపైన వొక సక్కనోడు... రాజు మాదిరిగా వుండాడు... గెట్టుమీద నిలబడి జూస్తావుంది చెంద్రి... వోడు పెదతలకాపు మాదిరి డంబంగా వుండాడనుకొన్నాది... చూపు మరల్చలేకుండా వుంది చెంద్రి. వోడి కళ్ళు చెంద్రినే జుట్టేసినాయి. కళ్ళు గలుసుకొన్నాయి. చెంద్రికి అల్లంత దూరాన ఆగింది పడవ... పడవ మీద నుంచి నిచ్చిన బడ్డాది వొడ్డుకు. దాని మీద వొస్తావుండాడు సక్కనోడు బారువ చేపమాదిరిగా... వోడి వళ్ళంతా బంగారం- జరీ గుడ్డలు, వోడి వొంటి తైలం వాసనకి వుప్పుకాలవ వొకసారి ఆగి మళ్ళీ పారింది...

దెగ్గరికొచ్చినాడు... దాహమిస్తావాని

అడిగినాడు... వాడి మెత్తటి పలుక్కి మనసు జివ్వున లాగింది చెంద్రికి... నీటి బుర్రందించింది. మబ్బులు ముసురుకుంటూ వుండాయి... గాలి జర్రున యీస్తావుండాది... నీ పేరు... చెప్పినాది... యింత అందగత్తెవి యిక్కడేం చేస్తున్నావు... చెంద్రి మొహం దామరమొగ్గయ్యింది... నాతో వస్తావా... అడిగాడు... రాను... వొస్తా.... పట్టుచీరలిస్తాను... వొడ్డాణమూ, నాగరాలు, చెంపసరాలు ఇస్తాను... వొస్తా... రాను... రా... వొ... స్వార్ణగాజులూ... వొ... జడకుచ్చులూ ఇస్తాను... రా... సుగంధతైలాది లేపనాలిస్తాను... రాను... వొస్తా... పంచభక్ష్య పరమాన్నాలిస్తాను... వొ... రా... చిక్కటి మధువునూ, హంసతూలికా తల్పాన్నీ సమకూర్చుతాను... వొస్తా... నిను నా గుండెల మీద పెట్టుకొంటాను... వొస్తా నొస్తానొస్తాను... వాడి చేతిలో బుర్ర కింద బడి ముక్కలయ్యింది. చెంద్రి చెంచెలంగా వాడితో పోయి పడవెక్కుతా వుంది. మరపడవ కదిలింది డబడబా... రాక్షసిలాగా... పొగ వొదులుతూ... గాలికి రొయ్యిపొట్టు ఎగిరిపోయింది. చీకట్లు గమ్ముకొంటున్నాయి. హోరుమని వాన గురస్తావుండాది.

కొత్త తెప్పెక్కి కిష్టడు వుప్పుగాలవలో వుషారుగా వొస్తావుండాడు... చినుకులు రాలతా వుండాయి. వొళ్ళు నిలవడం లేదు వోడికి... నీళ్ళ బుర్రలోని కల్లు వాడి నెత్తికెక్కింది. రివ్వున దోలతా వున్న సలిగాలితోబాటు వోడూ, తెప్ప బోతా వుండారు. ఈయాళకి చెంద్రి నా పక్కనుంటే యీ సలి అంతుజూసుండే వోణ్ణి అనుకొన్నాడు...

చినుకులాగినాయి... చింతాకంత తెరిపిచ్చింది. పడవట సూరుడు కుంకతా వుండాడు వానమబ్బులెనకాల. కిష్టడు తెప్పమీద ఎల్లికిలా పొణుకుని ఆకాశం సాయి జూస్తా వుండాడు... మబ్బుల తునకలు, పిట్టలు, సుక్కలో కదిలిపోతా వుండాయి. రెండు సుక్కల్ని జూసి... వొకటి నేను... ఇంకొటి చెంద్రీ అనుకొన్నాడు వోడు... యింట్లో చెంద్రి జేసుండే పచ్చాపల పులుసు వాసన గుర్తొచ్చి కళ్ళు మూసుకొన్నాడు వొడు... ఆ రేత్రి రెండో జామున గుడిశి జేరుకొన్నాడు కిష్టడు. చెంద్రిని నిద్దర్లేపగూడదని... పిల్లిలాగ అడుగో అడుగేసుకొంటా గుడిశిలోకి దూరినాడు. తారడతా, తడువుకొంటా అగ్గిపెట్టి దీసి దీపం ఎలిగిచ్చినాడు. గుడిశెంతా నిండేసిన గుడ్డిదీపం ఎలుగులో... కుక్కిమంచం వొక్కటే యిరామంగా వుండాది... అట్టా... యిట్టా బొయ్యింటాదనుకొన్నాడు... అయినా మనసు నిదానించడం లేదు... పొళాన్నంతా నిదర్లేపి ఎతికినాడు... కనబళ్ళేదు... వొడి మనసు మూలిగింది. వొడి నవనాళ్ళూ కుంగిపోయినాయి. ఆ రేత్రి వోడికి కాళరేత్రి అయ్యింది. తెల్లారింది, వేటకి సవద్రం మీదకి బొయిన అమాసిగాడు లగూదీసి రొప్పతా, రోస్తా వొచ్చి చెప్పినాడు కిష్టడితో- అనా... వేట జేస్తావుండంగా నన్ను మరపడవ దాటినాది... దానీ మూలరెక్కలో నించి ఏదో మూట మాదిరి వస్తవబడింది... తీరా జూస్తే యియ్యి నీ ఆడదాన్ని పేలికల్లాగా గనిపించినాయి. ఇంద అంటా ఇచ్చినాడు, అమాసిగోడు. వొట్ని మొకానికద్దుకొని వొలవొలా ఏడ్చినాడు. మనిషి జస్తే బతికిచ్చుకోగలడు వోడు... అసలు మనిషే గనిపిచ్చగుండా బోతే యేమి చెయ్యగలడు... పొంగతావుండే వుబద్రని సతాయించుకొని... కిష్టడు తెప్ప మిదెక్కి వుప్పు కాలవలో బడిపోతా వుండాడు సవద్రం సాయిం... కాలవ మీద నుంచి అడ్డంగా పారతా వుండే పెన్నమ్మలో గలిసి వొక్కవూపులో సవద్రం మీద దేలాడు. పోటు మీద వుండాది సవద్రం... ఎత్తి కుదేస్తా వుండాయి తెప్పని అలలు... ఆ నీళ్ళబయల్లో కసువు ముక్క మాదిరిగా తూరుపు దిక్కుగా సవద్రంలో బోతా వుండాడు... తొంబై తాటిచెట్ల లోతు... తెప్పని కుదిలిచ్చి పారేస్తా వుంది గంగమ్మ... ఆడాడ సొరచేపలు ఎగిరిపడతా

> **కొత్త తెప్పెక్కి కిష్టడు వుప్పుగాలవలో వుషారుగా వొస్తావుండాడు... చినుకులు రాలతా వుండాయి. వొళ్ళు నిలవడం లేదు వోడికి...**

వుండాయి... ఏ పక్క జూసినా నీళ్ళు... నీళ్ళు... గాలిదేవుడు తరవతా వుండాడు నీళ్ళని... కిష్టడి తలపైకి లేస్తావుండాయి అలలు... వొక్కో దెగిడ పెద్దపెద్ద సుళ్ళు దిరగతా వుండాయి నీళ్ళు... ఆకాశం సవద్రం వొక్కటయిపోయినట్టుగా ఎక్కడ జూసినా నీళ్ళు... కిష్టడికి యిగ్యేవీ గనపట్టం లేదు... నిరామయింగా బోతా వుండాడు... కళ్ళు మూసినా తెరిసినా వొడికి మరపడవ గనిపిస్తావుండాది. గుడ్డిగా... బోతానే వుండాడు వోడు.

అ మాదిరిగా వోడు రొండురేత్రిళ్ళు... రొండు పగళ్ళూ సవద్రంతో కొట్టాడినాడు దెయ్యంలాగా... కడాకి అలిసిపోయినాడు. మూడోనాటి సందేళకి వోడు దూరాన వొక పొగమేఘాన్ని జూసినాడు దానెనక లీలగా పడవ... మరపడవ. అంకాల్లో పేణాల్ని చేతల్లోకి దెచ్చుకొని తెడ్లేసినాడు... దెగ్గిర బడతా వుంది మరపడవ... హంసలాగా... నీళ్ళరెక్కలు గట్టుకొని బోతావుంది... చూపానవచ్చేసినాది... పైనెవరో, ఆడది. వుప్పుగాలికి అలిసిపోయి బొగ్గులాగైన కిష్టడికి దడదడా గొట్టుకుంటావుంది గుండి. అదేనా... కానట్టుండాదే... అదే... అవునదే... కోటి మందిలో గూడా దాని ఆనవాలు జెప్తాను నేను. అదే... అదే... ఎక్కడి లేని బలవొచ్చినాది కిష్టడికి... గాలివాలు మారి తూర్పుగాలి గొడతా వుంది... బాగా దెగ్గిరికొచ్చేసినాడు కిష్టడు... మరపడవ రెక్కంచున గాలికి ఎంటికలారబెట్టుకొంటా వుంది చెంద్రి... ఎంత మారిపోయినాది... దొరసానిలాగా... నూలుగుడ్డల్లో... సందేళ ఎలుగులో ముక్కెర తళుకుమంటూ... మరపడవ పక్కకి జేరినాడు... చెంద్రీ అంటా గుండిలవిసేలాగ ఎలుగెత్తి అరిసినాడు... ఆ దెబ్బకి సొరచేపలు అడుక్కిబొయినాయి. సవద్రం పిట్టలు ఎగిరిపోయినాయి. పేణాలు వొడి గొంతులో అరుపులయ్యి మోగినాయి...

తలతిప్పి చూసినాది-

చీవలాగా కిష్టడు అలలపై తేలతా వుండాడు కాయితం పడవలాంటి తెప్పమీద.

తల వొంచుకున్నాది.

దూకమని గుండిలు బాదుకొంటా వుండాడు కిష్టడు... వొడికేసి నిమ్మళంగా జూస్తాజెప్పింది... వొచ్చేది లేదు.

బారు అల వొక్కసారి ఎగిసింది... తెప్ప రంగులరాట్నం పెట్టి మాదిరి పైకి లేసింది అలల వుయ్యాల మీద. తెప్ప కొయ్యిని వుడుం మాదిరి బట్టుకొన్నాడు. ఆకాశం సవద్రం గిర్రన దిరిగిపోతా వుండాయి... దాని మాటకి వోడి వొంట్లో సత్తవంతా బొయ్యి తుంగలాగైనాడు. ఎన్ని బాదలు బడ్డాను నీ కోసం... వొలేసి ఎన్ని జేపల్ని జంపినాను నీ కోసం. ఎన్నిచ్చినాను నీకు నేను... కిష్టడి గుండి రగలకపోతావుంది.

ఏవిచ్చావు క్రిష్టయ్యా నువ్వు నాకు... చెబతావుందది... యేసవే గాదు దాని మాటా, పలుకూ అంతా మారిపోయింది. వొగస్తావుండాడు కిష్టడు.

... ముతకగుడ్డలూ, ఏలికల పీలికల చీరలూ, ఇత్తడి కమ్మలూ, రేకుంగరాలూ, శంకు గొలుసులూ, నూకల అన్నం, గంజి, ఎండి చేపలగబ్బూ, పొయ్యిపొగ, కుక్కిమంచం, ఇరుకు గుడిశా- ఇవేకదా నాకిచ్చింది నువ్వు...

ఇంతకు వొందరెట్ల డబ్బు నీకిస్తాను నన్నొదిలిపెట్టి వెళ్ళు... నీ వొంట్లో చేపల కంపు చెవటవోసన్ని నేను భరించలేను... నీ నల్లటి రంగు చూస్తేనే నాకు అసహ్యా వేస్తుంది... వెళ్ళు... నేను నీతో గడిపిన దినాలు వుత్త కలలు. నా చక్కనోడు నాకు అన్ని సుకాలు అమర్చాడు. ఆయిన నన్ను సంస్కరించాడు. నాకు నాగరికత నేర్పినాడు... నన్ను మనిషిగా జేసినాడు... ఇప్పుడు చెప్పు నువ్వు నాకేమిచ్చావో...

కిష్టడి కళ్ళు చింతమొద్దు నిప్పుల్లాగుండాయి... గొంతు పెరుక్కొని జెప్పినాడు కడగా... వొసే నీకు నా గుండినిచ్చినా... నా రకతమిచ్చినా... నా రకతంబొట్లిచ్చి నీ పేణాల్ని గాపాడుకొన్నా...

సరే నీ గుండె నా కిచ్చానంటున్నావు... దాన్ని నేనెపుడూ చూడలేదు. నువ్వు నాకిచ్చినట్టు గుర్తు లేదు. ఇదిగో నువ్విచ్చిన రెండు రక్తంబొట్లనూ నీకిస్తున్నా తీసుకో... అంటూ మరపడవ అంచునుండే మొండిశీలకు వేలిని గుచ్చింది.

వొద్దు... వొద్దు... వొద్దే చెంద్రీ అంటా గుండిలు బాదుకొంటా వుండాడు... ఆ ఆకారాలు జేస్తా కిలారిస్తా వుండాడు... అలల్లేస్తా వుండాయి... అలుపు లేకుండా మబ్బులు గమ్ముకొంటున్నాయి నాలుగు మూలలా... కస్సున దిగింది శీల, వేలిలోకి. గాలి భోమని గిరికీలు గొడతా వుండాది. వేలు లాగింది... ఎర్రటి రకతం ఛాయ వేలు సవద్రంలో కిష్టడిసాయి జూపిచ్చింది... వేలితో వొత్తింది... రెండు బొట్లు గాల్లోఎగిరి సవద్రంలో బడ్డాయి. అంతే- కుప్పగూలిపోయి పీనిగయ్యింది చెంద్రి... కిష్టడి గుండి ఆగిపోయింది... చూపు వాలిపోయింది... సవద్రంలో సుడిలేచినాది... ఇరవై ఎకరాల సుడి... గిర్రని గుండ్రంగా దిరగతా... ఆ మబ్బుల చీకట్లలో ఆరుపొద్దున్న వాన నిలిచి గురస్తావుండాది. గిర్రని దిరిగే ఆ సుళ్ళో... మరపడవా, తెప్పా... చెంద్రీ... కిష్టడూ తిరిగీ తిరిగీ... సవద్రం అడుక్కి బొయ్యినారు. సవద్రం అడుగులో ఆ గిర్రని దిరిగే సుళ్ళోంచి లేసిన వాయివుగుండాం వొడ్డుని అతలాకుతలం జేస్తావుంది... సగంలో ముగిసిన వొక కతని సవద్రం గుండిల్లో దాచుకొన్నది... గుప్తంగా... •

## వైన్ ఆయుష్షను పెంచుతుందా?



ఆసలు తాగని వారి కన్నా ఎంతో కొంత వైన్ పుచ్చుకునే వారు నాలుగు కాలాల పాటు బతికే అవకాశం వుందని 'ఆర్కైవ్స్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్' అనే పత్రిక లో ప్రచురితమైన ఒక వ్యాసంలో పేర్కొన్నారు. అరుదుగా వైన్, బీరు పుచ్చుకునే వారు గుండె జబ్బుల బారినే పడే ప్రమాదం తక్కువని ఈ సరికొత్త అధ్యయనం వెల్లడించింది. అందుకని మోతాదుకు మించి వీటికి బానిసలయినా ఆరోగ్య సమస్యలు తప్పవు మరి. కాని నెలలో కొన్ని గ్లాసుల వైన్ పుచ్చుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలేం తలెత్తవని అంటున్నారు. అందుకని ఆడవాళ్ళయినా, మగవాళ్ళయినా అరుదుగా వైన్ పుచ్చుకోవడం లాభకరమే గాని ఎలాంటి నష్టం లేదు. అప్పుడప్పుడు బీరు, వైన్ పుచ్చుకునేవారయినా కేవలం మందుతో సరిపెట్టకుండా తగిన ఆహారం కూడా తీసుకోవడం మంచిదని వారు చెబుతున్నారు.